క్లుప్తంగా

మహిళలపై ప్రభుత్వానికి గౌరవం లేదు..

● మాజీ ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: కూటమి ప్రభుత్వానికి మహిళలంటే గౌరవం లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. వండువ గ్రామంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాతో అమ్మాయిల ఫోటోలను చిత్రీకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్య సమాజం తలదించుకునే సంఘటనలు ఎన్ని జరుగుతున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఎప్పుడూ ప్రతిపక్షంపై బురద జల్లడం తప్ప సంక్షేమంపై దృష్టి సారించే ఆలోచన లేకపోవడం సిగ్గుచేటన్నారు.

నిరసన

పాలకొండ: ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ట్రెజరీ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీన వైఖరి విడనాడాలని కోరుతూ ఏపీటీడీ ఉద్యోగులు శుక్రవారం స్థానిక డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ప్రభుత్వ జీఓ ప్రకారం ఉద్యోగుల బకాయిలు, అలవెన్స్‌లు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పీఎల్ రావు, వి. రాజేష్, ఎం. వైకుంటరావు, ఎంఎస్ రావు, ఎస్‌టీ రావు, బీఎల్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్విన్‌పేట సీఐగా హరి



గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.హరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలా జరిగిన బదిలీల్లో ఇక్కడ సీఐగా పనిచేసిన పి.సత్యనారాయణకు శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు బదిలీ కావటంతో ఆయన స్థానంలో నర్సీపట్నం రూరల్ స్టేషన్(అనకాపల్లి)లో సీఐగా విధులు నిర్వహిస్తున్న హరిని నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని నల్లవారి రామమందిరంలో అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలు గణపతి పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: మండలంలోని లఖనాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని రచ్చబండ వద్ద రావివలస పీహెచ్‌సీ సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఈఓ ప్రకాష్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరికైనా జ్వర లక్షణాల కనబడితే తక్షణమే పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలన్నారు. జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించవద్దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సన్యాసమ్మ, బి.సురేష్‌కుమార్, తదితరులున్నారు.

జరడ రహదారి పరిశీలన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని జరడ గ్రామ రహదారిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జరడ రహదారిలో కొండచరియలు జారి పడటంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు నేతలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె రహదారిని పరిశీలించి కొండ చరిచలు జారిపడకుండా రక్షణ గోడ నిర్మించాలని అధికారులకు సూచించారు.

కోటదుర్గమ్మకు ఊయల వితరణ



ఊయల అందిస్తున్న శేషగిరిరావు దంపతులు

పాలకొండ రూరల్: నగరంలోని కోటదుర్గమ్మ ఆలయానికి ఎన్‌కే రాజపురం గ్రామానికి చెందిన వెన్నపు శేషగిరిరావు దంపతులు శుక్రవారం ఊయల సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకుడు లక్ష్మీప్రసాద్ శర్మ మాట్లాడుతూ, ఆరునెలల చిన్నారులకు ఊయలలో వేసి అమ్మవారి ఆశీస్సులు అందజేస్తామన్నారు.

నియమ, నిష్టలతో వినాయక ఉత్సవాలు



గొల్లవీధిలో అధికారుల అనుమతితో ఏర్పాటు చేస్తున్న వినాయక మంటపం

- మంటపాల ఏర్పాటుకు పోలీస్, విద్యుత్ శాఖాధికారుల అనుమతి తప్పనిసరి
- ఘర్షణలకు తావులేకుండా ఉత్సవ కమిటీలే బాధ్యత వహించాలి : డీఎస్పీ జీవీ కృష్ణారావు

పాలకొండ రూరల్: గణనాథుని నవరాత్రి మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో, నియమ నిష్టలతో జరుపుకోవాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు స్పష్టం చేశారు. మంటపాలు ఏర్పాటు చేయాలనుకునే యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమతులను ట్రాన్స్‌కో ఈఈ మూర్తితో కలిసి ఆయన వివరించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అలాగే మంటపాల ఏర్పాటు, విద్యుత్ అలంకరణల విషయంలో సంబంధిత శాఖ అనుమతులు, సూచనలు పాటిస్తే అపశృతులకు తావుండదని చెప్పారు.

నిబంధనలు ఇలా..

- విగ్రహ ఏర్పాటుకు కమిటీలు తప్పనిసరిగా ముందస్తు పోలీసుల అనుమతులు పొందాలి.
- వివాదాస్పద స్థలాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాల్లో మంటపాలకు అనుమతులు ఉండవు.
- విగ్రహాలు, మంటపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ బాక్సులు, మైక్‌సెట్‌లకు అనుమతులు తప్పనిసరి. మితిమీరిన సౌండ్ నిషిద్ధం. ఉత్సవాల్లో భాగంగా అశ్లీల నృత్య ప్రదర్శలు ఏర్పాటు చేయరాదు. మత్తు పానీయాలు సేవించరాదు.
- విద్యుత్ శాఖాధికారుల అనుమతులతో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు శాఖాపరమైన అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటు చేయాలి. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ఉత్సవ కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుంది.
- ఉత్సవ నిర్వహణకు సంబంధించి బలవంతపు చందాలు, వసూళ్లకు పాల్పడరాదు. ఇలా చేస్తే చట్టరీత్యా నేరం.
- మసీదులు, చర్చిల సమీపంలో మంటపాలను ఏర్పాటు చేసే వారు నమాజ్, ప్రార్థనలు జరుగు ప్రత్యేక సమయంలో వారికి సహకరించే విధంగా సౌండ్ సిస్టమ్‌లను పూర్తిగా ఆపుచేయాలి.
- అనుమానిత వ్యక్తులను మంటపాల వద్ద గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- రాత్రి 10 గంటల తర్వాత మంటపాల వద్ద కార్యక్రమాలను నిలిపివేయాలి. మైక్‌సెట్లను కూడా ఆపివేయాలి.
- విగ్రహాల నిమజ్జన సమయంలో తగు నిబంధనలు పాటించాలి. ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పాటించడం తప్పనిసరి.
- వీలైనంతమేరకు నిమజ్జనాలు రాత్రి 9 గంటల్లోపు పూర్తి చేయాలి. బాణసంచా వినియోగం సరికాదు.
- విగ్రహాలు ఎక్కడ ఏర్పాటు చేస్తారు.. నిమజ్జనం ఎప్పుడు చేస్తారనే వివరాలు ముందుగానే తెలియజేయాలి.

ఆధ్యాత్మిక చింతనతో వేడుకలు ..



అన్నివర్గాల ప్రజలు గణపతి నవరాత్రి వేడుకలను ఆనందంగా, ఆధ్యాత్మిక చింతనతో జరుపుకోవాలి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకూడదు. ముఖ్యంగా అధికారులు సూచిస్తున్న నిబంధనలు మన మంచికే అన్న అంశాన్ని నిర్వాహకులు గుర్తించాలి. ఇతరులకు ఇబ్బందుల్లేకుండా వేడుకలు చేపట్టాలి. – జీవీ.కృష్ణారావు, డీఎస్పీ, పాలకొండ

ముందస్తు అనుమతులు తప్పనిసరి..



వినాయక ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు ముందస్తు అనుమతులు పొందాల్సిందే. శాంతిభద్రలతకు విఘాతం ఏర్పడకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మంటపాలను ఏర్పాటు చేయాలి. నిబంధనలు పాటిస్తే సమస్యలు తలెత్తవన్న విషయాన్ని మరువకూడదు.

– ప్రయాగమూర్తి, ఎస్సై, పాలకొండ.

భద్రత ముఖ్యం..



వినాయక నవరాత్రి ఉత్సవాలను అన్నివర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకోవాలి. ఈ క్రమంలో భక్తుల భద్రత ముఖ్యం. ముందస్తుగా మా శాఖను సంప్రదిస్తే విద్యుత్ సరఫరా ఏర్పాట్లుకు అనుమతులు అందిస్తాం. విద్యుత్ చౌర్యానికి పాల్పడే క్రమంలో ప్రమాదాలు తప్పవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ఎస్.శ్యామ్‌సుందర్, ట్రాన్స్‌కో ఏఈ, పాలకొండ

మొదలైన చవితి సందడి..

వీరఘట్టం: వినాయక చవితి ఉత్సవాలకు వీరఘట్టం పట్టణంలో సందడి మొదలైంది.సెప్టెంబర్ 7వ తేదీ నుంచి వినాయక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి నుంచే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గణనాథుల విగ్రహాలు విక్రయానికి సిద్ధంచేశఙారు. ఒక్కో విగ్రహం రూ. పది వేల నుంచి 35 వేల రూపాయల వరకు పలుకుతున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు



పట్టణంలో తయారీలో ఉన్న వినాయక విగ్రహం

సమన్వయంతో అభివృద్ధి



మాట్లాడుతున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించినప్పుడే నగర పంచాయతీ అభివృద్ధి సాధ్యపడుతుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పట్టణంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని సింగన్నవలస గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు నిర్మాణానికి స్థలం పరిశీలించామని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి 'పీఎం జన్‌మాన్'



సమావేశంలో పాల్గొన్న అధికారులు

గరుగుబిల్లి: గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మాన్ పథకాన్ని అమలు చేస్తోందని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని రాయిందొరవలస, చినగుడబ పంచాయతీ గదబవలస గ్రామంలో పీఎం జన్‌మాన్ పథకంపై శుక్రవారం గిరిజనులకు అవగాహన కల్పించారు. గిరిజనులకు మౌలిక సదుపాయాలైన ఇళ్లు, తాగునీరు, విద్యుత్, రహదారులు, కాలువలు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన వారు ఈ పథకంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ రమేష్, తదితరులు

కొమరాడ: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించాలని తహసీల్దార్ ఆర్.రమేష్ కోరారు. విక్రంపురం సచివాలయం ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవాళి మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. మొక్కలను సంరక్షిస్తే అవి కాలుష్యాన్ని నివారిస్తాయని, భూ వాతావరణం వేడెక్కకుండా కాపాడుతాయని, వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కళింగి మల్లేశ్వరావు, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, పంచాయతీ కార్యదర్శి బీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



సరస్వతీదేవి విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపీటీసీ సత్యనారాయణ, తదితరులు

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహన్ని శుక్రవారం ఆవిష్కరించారు. స్వామిసేవా సమితి కార్యదర్శి కంచుమోజు రామ్మోహనరావు ఈ విగ్రహాన్ని వితరణ చేశారు. పార్వతీపురానికి చెందిన జ్యోతిష్యుడు మురపాక కాళిదాసుశర్మ బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కలశస్థాపన, పూర్ణహుతి, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. స్థానిక ఎంపీటీసీ ద్వారపురెడ్డి సత్యనారాయణ, గౌరమ్మ దంపతులు ఈ పూజలు చేయగా.. గ్రామంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.నాగభూషణరావు, కె.కొండలరావు, జల్లు బాబ్జి, స్థానిక హెచ్ఎం మద్రాపు మహేష్, తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులు చదువులపై దృష్టి సారించి ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సారథి ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చెడు అలవాట్లకు బానిసవ్వకుండా చదువు పట్ల దృష్టి సారించాలని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం సమకూర్చిన నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, ఎలిన్‌పేట సర్పంచ్‌లు బి.గౌరీశంకరరావు, ఆర్.ఎస్.చైతన్య స్రవంతి, టీడీపీ కన్వీనర్ పాడి సుదర్శనరావు, కళాశాల కరస్పాండెంట్ చిన్నంనాయుడు, నిర్వాహకులు ఎస్.రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మేటల తరలింపుపై చర్చ

భామిని: మండలంలోని కాట్రగడ–బి ఓపెన్‌హెడ్ చానల్ సైడ్ వియ్యర్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలు తీసివేత, తరలింపులపై భూగర్భగనులు, రెవెన్యూ శాఖాధికారులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చర్చించారు. భామిని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు సారథ్యంలో ఏపీఎండీసీ కుమారస్వామి, శ్రీనివాసరావు సమావేశమయ్యారు. ఇసుక తరలింపు బాధ్యతలు కాట్రగడ–బి, నేరడి–బి సచివాలయాల సిబ్బందికి అప్పగించడానికి నిర్ణయించారు.

నేరడి సచివాలయం సిబ్బందికి బుకింగ్ పాయింట్, కాట్రగడ సిబ్బందికి స్టాక్ పాయింట్ అప్పగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ నిమ్మల శేఖరం, ఆర్ఐ ఎస్.రాంబాబు, కాట్రగడ కార్యదర్శి కలిశెట్టి సంతోష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

రక్షణ గోడ నిర్మించండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఇటీవల కురుస్తున్న వర్షాలకు కురుపాం మండలంలోని గిరిశిఖర గ్రామమైన జరడకు వెళ్లే ఘాట్‌రోడ్డులో కొండ చరియలు జారిపడుతున్నాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వారంతా భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని జరడ గ్రామస్తులు కోరుతున్నారు.

డీడీ కార్యాలయం తరలించవద్దు..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

సీతంపేట: స్థానికంగా ఉన్న గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలించవద్దని గిరిజన జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డీడీ కార్యాలయం తరలిపోతే స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడతారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సబ్ జైళ్ల అధికారి మోహనరావు

పాలకొండ రూరల్: వివిధ కేసుల్లో చిక్కుకుని కారాగారాల్లో ఉంటున్న రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు తొలి ప్రాధాన్యం కల్పించాలని జిల్లా జైళ్ల శాఖ అధికారి కె.మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించి, ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో అవసరమైన చర్యలు చేపట్టాలని జైల్ సూపరింటెండెంట్ బి.జోగులను ఆదేశించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, వంటశాల, రికార్డుల నిర్వహణ, మెనూ అమలుపై పలు సూచనలు చేశారు.

హౌసింగ్ బిల్లుల మంజూరుకు సర్వే

గుమ్మలక్ష్మీపురం: ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో భాగంగా 20216–17, 2017–18, 2018–19 సంవత్సరాలకు సంబంధించిన గృహ నిర్మాణ లబ్ధిదారులు బిల్లులకు నోచుకోని వారు ఉంటే వారి వివరాలు సేకరించాలని మండల నోడల్ అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుమలయ్య సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2021–22లో మంజూరైన ఇళ్ల ప్రగతి ఎలా ఉందో అడిగితెలుసుకున్నారు. అలాగే మినీ రిజర్వాయర్లు, ఫారం పాండ్లు, చెరువుల్లో చేపల పెంపకానికి ముందు కొచ్చేవారిని గుర్తించాలన్నారు. వారికి ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్ రాజు, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం ..

● ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి



నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఈఈ గోపాలకృష్ణమూర్తి

వీరఘట్టం: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే తమ లక్ష్యమని ట్రాన్స్‌కో ఈఈ గోపాలకృష్ణమూర్తి అన్నారు. వీరఘట్టం, నవగాం విద్యుత్ సబ్‌స్టేషన్లలో చేపట్టిన మెయింటినెన్స్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాలు పడుతున్న సమయంలో పంపుసెట్లు ఆన్‌చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెప్పులేకుండా మోటార్ స్విచ్‌లు వేయకూడదని సూచించారు. పంట పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, వెంటనే విషయాన్ని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు



మొక్క నాటుతున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. వనం – మనం కార్యక్రమంలో భాగంగా నగర పంచయతీ కార్యాలయంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పచ్చదనం పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం

పాలకొండ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ల నూతన కార్యవర్గాన్ని పాలకొండ పట్టణంలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా సనపల విజయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్. ఫాతిమాబీబీ, కె. లక్ష్మీ, కార్యదర్శిగా డి. మంగమ్మ, సహయ కార్యదర్శిగా పి. స్వాతి, కోశాధికారిగా పి. మోహిని, ఉప కోశాధికారిగా ఆర్. ధనలక్ష్మి, జనరల్ సెక్రటరీగా జి. చిన్నతల్లి, ఎంఎం సుశీలరాణి, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్. నిర్మల ఎన్నికయ్యారు. ఈ మేరకు కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీ చేయాలి..



మాట్లాడుతున్న లీగల్ అథారిటీ చైర్మెన్ కృష్ణ సాయితేజ

పాలకొండ రూరల్: ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ వేదికగా వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీమార్గంలో పరిష్కరించాలని లీగల్ అథారిటీ చైర్మెన్ పీఎస్‌వీబీ కృష్ణ సాయితేజ అన్నారు. శుక్రవారం స్థానిక న్యాయస్థానంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే కషాయాలతో పంటలను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించవచ్చని రైతు సాధికార సంస్థ ప్రతినిధి నరసింహదేవ్ అన్నారు. మండలంలోని టీకేజమ్ము గ్రామంలో రైతులకు నీమాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ణి కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. రసంపీల్చే పురుగు, కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, వంటి తెగుళ్ల నివారణకు ఈ కషాయాలు బాగా పనిచేస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకపోవడం వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. వీటికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, సిబ్బంది సూర్యనారాయణ, మోహనదాస్, తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి



నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూపీఎస్ రద్దును చేసి పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పాత తాలూకా కేంద్రాల సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్డీ కార్యాలయం వద్ద ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకించిన విధానాన్నే తెరపైకి తీసుకురావడం సరికాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆరిక భాస్కరరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.పైడిరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.